నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామ్ బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆజామ్‌బాద్ ఫీడర్ పరిధిలో అచ్చుత్‌రెడ్డినగర్ మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గూండు, విద్యానగర్ పోస్టు ఆఫీస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. రాంనగర్ ఫీడర్ పరిధిలో రాంనగర్, టీఆర్‌టీ క్వాటర్స్, రెడ్డి ఆయిల్‌మిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. దయారమార్కెట్ ఫీడర్ పరిధిలో దయారమార్కెట్, హరినగర్, సాగర్ లాల్ ఆసుపత్రి, రిసాల, తాడి కంపౌండ్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంచాలి

కాచిగూడ: విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకునే గడువును మరో రెండు వారాల (ఫిబ్రవరి 15) పాటు పెంచాలని బీసీ విద్యార్థి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... పారామెడికల్ గ్రాడ్యుయేషన్, పీజీ కోర్సుల తరగతులు పది రోజుల క్రితమే ప్రారంభమయ్యాయన్నారు. దీంతో చాలామంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చి విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని, వారి ఆర్థిక పరిస్థితులు, చదువును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును పెంచాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈ విషయంపై త్వరలోనే సంబంధిత మంత్రులను, ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సేన నేతలు భాస్కర్, శ్రీనివాస్, వినోద్, ప్రవీణ్, వంశీ, కిరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలను సహించం

కాచిగూడ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు చేయడం మానుకుని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మామిడాల రాజ్‌కిరణ్ అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీఎంపై ఇష్టం వచ్చిన రీతిలో విమర్శలు చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే మాజీ మంత్రి కేటీఆర్ ఇలాంటి తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికి, రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు.

గద్దర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ తదితరులు


నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట రత్నానగర్‌లోని జాగృతి కార్యాలయంలో ప్రజా యుద్ధ నౌక దివంగత గద్దర్ జయంతిని నిర్వహించారు. దీనికి హాజరైన జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ, బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ అక్కడ ఏర్పాటు చేసిన గద్దర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బస్తీ పెద్దలు ఎం.బి.కిషోర్ కుమార్, ఆర్. నర్సింగ్ రావు, కృష్ణ, రామకృష్ణ, పాతకోటి మహేష్, ఎం.బి.కిషోర్ కుమార్, నందు, బాలేష్, బంటు, సురేందర్, పాదం వెంకటేశ్, మధు గౌడ్, మహేందర్, బొట్టు సతీష్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానవాపి సమస్యపై కోర్టు తీర్పు చరిత్రాత్మకం


సూర్యప్రకాశ్

నల్లకుంట: జ్ఞానవాపి మసీదు పునాదుల కింద పెద్ద హిందూ దేవాలయం ఉందని పురావస్తు శాఖ ఇచ్చిన నివేదిక సూచిస్తుందని, ఆ నివేదిక ప్రకారం అక్కడ హిందువులు పూజలు చేసుకోవచ్చని అక్కడి స్థానిక కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని బీజేపీ ధార్మిక పరిషత్ కన్వీనర్ అన్నావఝుల సూర్యప్రకాశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... జ్ఞానవాపి ఆవరణలోని ఆలయంలో పూజలు చేసుకోవడానికి స్థానిక కోర్టు అనుమతివ్వడం, ఏడు రోజుల్లో పూజలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ సమస్యపై కోర్టు స్పందించిన తీరు న్యాయ వ్యవస్థ గొప్పతనానికి నిదర్శనమని కొనియాడారు. హిందూ ధర్మం సనాతనమైనదని, ఆ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విశ్వ వ్యాప్తంగా ఉన్న హిందువులందరిపై ఉందన్నారు. ఇటీవల అయోధ్యలో బాల రాముడి ఆలయ ప్రారంభ పండగ జరుపుకొన్నామని, త్వరలోనే జ్ఞానవాపి విముక్తి పండగ కూడా జరుపుకొంటామని ఆయన పేర్కొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



కాచిగూడ: శ్రీసాయి శాంతి సహాయ సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్గీయ తేర్ల నరసింహ మూర్తి జయంతి సందర్భంగా బుధవారం ఆ సంస్థ వ్యవస్థాపక చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రం పూర్ణశాంతి గుప్తా పేదలకు అన్నదానం చేశారు. రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై, బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద ఆకలితో అలమటిస్తున్న వారి వద్దకే వెళ్లి ఆహారంతో పాటు నీటి బాటిల్స్‌ను అందజేసి వారి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు.

వెంకయ్యనాయుడికి అభినందన



కాచిగూడ: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు దేశ రెండవ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్న సందర్భంగా వీబీజీ ఫౌండేషన్, ఎంఎంఎస్ వ్యవస్థాపకులు మడిపడిగె రాజు నేతృత్వంలో ప్రతినిధులు బుధవారం ఆయన నివాసంలో కలిసి పూలబొకే, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎంఎంఎస్ సంస్థ ప్రతినిధులు పుల్లూరు శ్రీకాంత్, సిద్ధార్థ్, రాజేశ్వరి, తేజశ్రీ, విఫిన్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. జీతాలు వస్తలేవు!

- మూడు నెలలు కావస్తున్నా అందని వేతనాలు
- జీతం కోసం ఫీవర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరు బాట
- ఉద్యోగుల నిరసకు టీఎంహెచ్ ఈయూ మద్దతు


వేతన బకాయిల కోసం ఫీవర్ ఆస్పత్రి ల్యాబ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసన

నల్లకుంట: అసలే అరకొర వేతనాలు.. అవి కూడా మూడు నెలలుగా ఇవ్వకపోవడంతో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. వీరిలో శానిటేషన్, అటెండర్స్, జూనియర్ అనలిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఆపరేటర్లు ఇలా మూడు కేటగిరీల వారిగా రూ. 12,000 నుంచి రూ. 15,500, 13 ఏళ్లకు పైగా (2013 నుంచి) 74 మంది ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న వీరికి నక్షత్ర కన్సల్టెన్సీ, సాహితి కన్సల్టెన్సీ కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరులో జాప్యం కారణంగా ఉద్యోగుల వేతనాలు అందించడంలేదని సమాచారం. ఏదైనా కారణంగా ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు మంజూరు కానప్పటికీ సదరు కాంట్రాక్టర్లు ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు చెల్లించాలనే నిబంధన ఉంది. కాని ఆ నిబంధనలను పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహించారు.

- మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు పలు మార్లు కాంట్రాక్ట్‌ను కలిశారు. అయినా స్పందన రాలేదు. సమస్యను ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకు వెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో విసుగు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం ఆస్పత్రి ఆవరణలో గంట పాటు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.
- అరకొర వేతనాలు చెల్లిస్తున్నా బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నామని, తమకు చెల్లించాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ల్యాబ్‌లో విధులకు ఆటంకం ఏర్పడకుండా ప్రస్తుతం ఒక గంట మాత్రమే నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. అధికారులు స్పందించి తక్షణమే వేతన బకాయిలు చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- వేతన బకాయిల కోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసనకు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) మద్దతు తెలియజేసింది.
- టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, యూనియన్ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య మాట్లాడుతూ... అరకొర వేతనాలకు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రతి నెల సక్రమంగా జీతాలు చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్లు స్పందించి తక్షణమే ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
- కార్యక్రమంలో టీఎంహెచ్‌ఈయూ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జనార్దన్, సతీష్, పద్మజ, నాయకులు నవాజ్, యాస్మీన్, భాగ్య, మాయ, కరీనా, నర్సింహా, నాగలక్ష్మి, నరేష్, చారి, సంతోష్, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాలి



వైరాలజీ ల్యాబ్‌లో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న మాకు నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదు. దీనికి తోడు జనవరి నెల వేతనం రావాలి. దీంతో విధులకు రావడానికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలి.
– డి.నర్సింహ, అటెండర్

సత్వరమే విడుదల చేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. నెలనెలా వేతనాలు సరిగా అందకపోవడంతో కొంత ఊరట కలిగిస్తోంది. మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి వెంటనే వేతనాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలి.
– యాస్మీన్, శానిటరీ ఉద్యోగిని

ఘనంగా 'అరబిక్' దినోత్సవం


ప్రొఫెసర్ సయ్యద్ జహంగీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అరబిక్ భాషా దినోత్సవాన్ని బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇఫ్లూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ జహంగీర్ మాట్లాడుతూ... అరబిక్ మతపరమైన భాష కాదన్నారు. అది చారిత్రాత్మకమైన అతిపురాతనమైన భాష అని అన్నారు. ఈ భాషకు మూలం హిబ్రూ భాష అన్నారు. అరబిక్ ప్రపంచంలో 6వ భాషగా గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు. ఈ భాష పట్ల మరింతగా అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం ఆకాశవాణిలో నా వాణి రేడియో టాక్స్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కళాశాల అరబిక్ భాష అధ్యక్షుడు ఎం.ఎఫ్.రహమాన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భవాని, కె.కవిత, డాక్టర్ పి.మాధవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ సయ్యద్ జహంగీర్‌ను సత్కరించారు.

సేవాలాల్ జయంతి నిర్వహణకు రూ. 10 కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న బూక్యా సంజీవనాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ మహరాజ్ జయంతిని ఈ నెల 15న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుందని ఈ జయంతి నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 10 కోట్ల నిధులను కేటాయించాలని సేవాలాల్ సేనా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బూక్యా సంజీవనాయక్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతికి కోటి రూపాయలు మాత్రమే కేటాయించిందని అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా త్రిసభ్య కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బూక్యా సంజీవనాయక్ మాట్లాడుతూ... సేవాలాల్ జయంతిని రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా సేవాలాల్ గురువుల చేత సాంప్రదాయ బద్ధంగా లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీలకు కేబినెట్‌లో అవకాశం కల్పించకపోవడం విచాకరమన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన అధ్యక్షుడు అంబోతు రాంబాబు, రాష్ట్ర నాయకులు చిన్నబాబు, ప్రేమ్‌చంద్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, రఘురామ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ బస్తీవాసులకు పునరావాసం కల్పించాలి


ఆర్డీఓకు వినతిపత్రాన్నిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు పునరావాసం కల్పించాలని దళిత బహుజనఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ రవికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాలుగా నివాసముంటున్న దళితుల ఇళ్లను కూల్చివేయడం సరికాదన్నారు. వారికి పునరావాసం కల్పించకుండా రోడ్డున పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పులి కల్పన, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- వివేకానందనగర్ బస్తీ బాధితులకు వేంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసి ఆదుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు.
- వివేకానందనగర్ బస్తీవాసులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని హైదరాబాద్ కలెక్టర్‌కు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... గుర్తుతెలియని యువకుడు(30) తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు.

సంగీతాన్ని అస్వాదిస్తే జన్మ సార్థకత


సంగీత గురువు రామాప్రభను సన్మానిస్తున్న నాగమారుతి శర్మ, జనార్దనమూర్తి

చిక్కడపల్లి: సంగీతాన్ని అస్వాదించడం ద్వారా మానవ జన్మకు సార్థకత లభిస్తుందని సీబీఐ కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నాగమారుతి శర్మ అన్నారు. త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్ నిర్వహణలో త్యాగరాజ స్వామి 177వ ఆరాధన వేడుకలలో భాగంగా బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగమారుతిశర్మ పాల్గొని ప్రసంగించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో సంగీత గురువు వై.రమాప్రభ, గానసభ సంయుక్త కార్యదర్శి బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సంగీత గురువు రామాప్రభ ఆధ్వర్యంలో శిష్యబృందం త్యాగరాజ పంచరత్న కీర్తనలు సుమధురంగా ఆలపించారు.

సుందరకాండ మహాయజ్ఞం



చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధ యజ్ఞం పూజలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 9 గంటలకు అష్టోత్తర హనుమాన్, చాలీసా సహిత సుందరకాండ హోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు అవాహిత దేవతా ప్రదోషకాల పూజ, రాజోపచారం, మంగళ హారతి, మంత్రి పుష్పం తదితరాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాల వెంకటాద్రి, ఎస్‌బీవీఎస్ ఆచార్య, రాజశేఖర్ శర్మ, మాజీ చైర్మన్ పద్మ సూర్యప్రకాష్, సభ్యులు మురికిగణేష్, తమ్మన వేణుగోపాల్‌లు హోమం నిర్వహించారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి: స్వర విహారం కళా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలోని ర్వహించిన నిర్విరామ సినీసంగీత విభావరి అలరించింది. బుధవారం సంస్థ అధ్యక్షుడు రామ్‌ద్రోణంరాజు నిర్వహణలో గాయనీగాయకులు ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబు నటించిన చిత్రాలలోని ప్రాచుర్యం పొందిన గీతాలను శ్రవణానందంగా ఆలపించారు. వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీరామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని గాయనీగాయకులను అభినందించారు. కార్యక్రమంలో సౌభాగ్యలక్ష్మి, జ్ఞానవల్లి పాల్గొన్నారు.

కేసీఆర్ కుట్రలపై తెలంగాణ జన సమితి ఆగ్రహం

కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం


ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న జన సమితి నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం శాసన మండలి ఎన్నికను అడ్డుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్ కుట్రలను నిరసిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిరసనకు దిగారు. తెలంగాణ జన సమితి ముషీరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య మాట్లాడుతూ... కోదండరాంపై కేసీఆర్ కుట్రలు కొత్తేమీ కాదని గడచిన తొమ్మిది సంవత్సరాలుగా పలువిధాలా దాడులకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో కోదండరాం పోటీ చేస్తే కోట్లాది రూపాయల ఖర్చు పెట్టి ఆ రోజు ఓడించారని పేర్కొన్నారు. కోదండరాం ఇంటి తలుపులు బద్దలు కొట్టడమే కాకుండా అనేక రకాల కేసులను పెట్టి తొమ్మిది సంవత్సరాలుగా పలు రకాల దాడులకు పాల్పడ్డ కేసీఆర్ చట్టసభలకు ఎన్నిక కాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేసీఆర్ చేస్తున్న కుట్రలకు తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు వ్యతిరేకించాలని కోరారు. తెలంగాణ ప్రజల నుంచి శాశ్వతంగా కేసీఆర్‌ను దూరం చేసే రోజులు దగ్గరపడ్డాయని ఆయన పేర్కొన్నారు. ఈదిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం నాయకులు మధు, జైపాల్‌రెడ్డి, పులిపాటి సుధాకర్, అజయ్‌గౌడ్, వెంకటయ్య, కాకునూరి సుధాకర్, పవన్, సురేష్, రసూల్, మణిక్యం, సాయి, భాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో శ్రీనివాస్‌నగర్, వినాయకనగర్ చౌరస్తాల్లో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మావతి, డి.పి.రెడ్డి, నాయకులు చంద్రమోహన్, అంజి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు కె.రామానందం అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బుధవారం పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట, రఘువీర్ విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, లాయన్స్ క్లబ్ పద్మకాలనీ సొసైటీ సంయుక్త సహకారంతో గురునానక్ కేర్ ఆసుపత్రి సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌తో పాటు ఈసీజీ, డెంటల్, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఆర్‌సీ మురళీకృష్ణా, మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు, ఆదర్శ లాయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రేఖజాహుర్, అల్లాడి శ్రీనివాస్, కోనేరు జైహింద్, ముఖ్య సలహాదారులు రామలింగేశ్వర్‌రావు, విశ్వనాథ శాస్త్రి, వెంకట్, నీలా శ్రీధర్, శరత్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

ముషీరాబాద్: ముషీరాబాద్ మెట్రో స్టేషన్ కింద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో స్థానికులు, వాహనాదారులు ఆందోళన చెందారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముషీరాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు రావడంతో చుట్టు పక్కల ఉన్న చెత్తచెదారం అంటుకోని మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఈ అగ్ని ప్రమాదంతో ఎలాంటి నష్టం జరగకపోవడంతో స్థానిక ప్రజలు వాహనాదారులు, పాదచారులు ఊపిరి పీల్చుకున్నారు.

కోదండరాం పట్ల బీఆర్ఎస్ తీరు దారుణం: నిరుద్యోగ జేఏసీ


నిరసన చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు

చిక్కడపల్లి: ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం ప్రమాణ స్వీకారాన్ని బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడం సరికాదని నిరుద్యోగ జేఏసీ నాయకులు గొంగిడి వెంకట్‌రెడ్డి, డి.సలీమ్‌లు అన్నారు. బుధవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయ ఆవరణలో నిరుద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కోదండరాం గత సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆయనపై వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులు సురేష్, మహేష్, పరుశరామ్, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సమాచారం మేరకు... గుర్తుతెలియని యువకుడు (30) మంగళవారం రాత్రి మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.